

ఆగుతూ.. సాగుతూ..

శిక్షణ రేంజ్ అధికారుల క్షేత్రస్థాయి పర్యటన శనివారం ముగిసింది. గోండుగూడ బేస్‌క్యాంపులో మకాం వేసి అడవిలో అభివృద్ధిపై అధ్యయనం చేశారు. 8లో ▸



ఆ మజాయే వేరబ్బా..!

మారుతున్న కాలం.. ప్రజల అభిరుచికి అనుగుణంగా వ్యాపార సంస్థలు కొత్తదనాన్ని పరిచయం చేస్తున్నాయి. విభిన్నమైన సెట్టింగ్‌లతో హోటళ్లు అబ్బురపరుస్తున్నాయి. 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0 / 17.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఉత్తరం దిశగా చలిగాలులు వీస్తాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ భారతి హోళ్లికేరి

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 26న గణతంత్ర దినోత్సవ వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ భారతి హోళ్లికేరి అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు మధుసూదన్ నాయక్, బి.రాహుల్‌రాజ్, ట్రెయినీ కలెక్టర్ పి.గౌతమితో కలిసి జిల్లా శాఖల అధికారులతో గణతంత్ర దినోత్సవ వేడుకల సన్నాహక ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో ఘనంగా జరిగేలా సిద్ధంగా ఉండాలని తెలిపారు. ప్రభుత్వ శాఖల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన విజయాలతో ప్రజలకు తెలిసే విధంగా స్టాళ్లు ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రభుత్వ శాఖల నుంచి అత్యున్నత సేవలు అందిస్తున్న వారితోపాటు వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారి ఎంపికకు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఆర్డీవో వేణు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మైసమ్మ జాతర పోస్టర్లు ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న విప్ సుమన్

రామకృష్ణాపూర్: వచ్చే నెల 3, 4, 5 తేదీల్లో బొక్కలగుట్ట శివారులోని గాంధారి ఖిల్లాలో నిర్వహించనున్న గాంధారి మైసమ్మ జాతర పోస్టర్లను ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో శనివారం ఆవిష్కరించారు. మైసమ్మ జాతర కోసం రూ.2.10 కోట్లతో నూతన బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టినందుకు ఎమ్మెల్యేకు ఆదివాసీ నాయక్‌పోడ్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయక్‌పోడ్ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంజి రాజన్న, కార్యదర్శి భీంరావు, జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కొత్తపల్లికి రోడ్డు రూ.2.50 కోట్లతో నిర్మాణం

భీమారం: భీమారం మండల కేంద్రం నుంచి కొత్తపల్లి వరకు రూ.2.50 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయిందని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ తెలిపారు. మండలంలోని అంకూసాపూర్, ఆరెపల్లి, మద్దికల్, కొత్తపల్లి గ్రామాలను కలుపుతూ నిర్మించిన కొత్తపల్లి రోడ్డు ద్వారా ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయం కలుగుతుందని పేర్కొన్నారు.

కంటి వెలుగు శిబిరం సందర్శించిన కలెక్టర్

తాండూర్: మండలంలోని గోపాల్‌నగర్ గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని కలెక్టర్ భారతి హోళ్లికేరి శని వారం ఆకస్మికంగా సందర్శించారు. కంటి పరీక్షల కోసం వచ్చిన వృద్ధులతో మాట్లాడారు. మండల ప్రత్యేకాధికారి గజానంద్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, మెడికల్ అధికారి కుమారస్వామి పాల్గొన్నారు.

మూడో రోజు 879 మందికి పరీక్షలు

మంచిర్యాలటౌన్: కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మూడో రోజు శనివారం 879 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం ఐదు క్యాంపుల్లో 879 మందికి పరీక్షలు నిర్వహించి, 232 మందికి రీడింగ్ గ్లాసులు ఇచ్చామని, 99 మందికి కంటి అద్దాల కోసం రెఫర్ చేశామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు తెలిపారు.

పోలీసులు ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలి



మాట్లాడుతున్న డీసీపీ అఖిల్ మహాజన్

మంచిర్యాలక్రైం: పోలీసులు మానసికంగా, ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని రామగుండం పోలీస్ కమిషనరేట్ డీసీపీ(అడ్మిన్) అఖిల్ మహాజన్ అన్నారు. కమిషనరేట్ హెడ్ క్వార్టర్స్‌లో శనివారం మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల ఆర్మ్‌డ్ పోలీస్ అధికారులు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వీక్లీ పరేడ్ నిర్వహించారు. అనంతరం వైద్యులతో వైద్య సలహాలు, చికిత్సపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ సుందర్‌రావ్, ఆర్‌ఐలు మధూకర్, శ్రీధర్, విష్ణుప్రసాద్, ఆర్ఎస్సైలు రాజేష్, ప్రవీణ్, అనిల్, విశ్వజ, శ్రావణి, ఆమీదాబేగం పాల్గొన్నారు.

బియ్యం నిల్వల్లో తేడా..!

నస్పూర్‌లోని ఎంఎల్‌ఎస్ పాయింట్





- జిల్లా పౌరసరఫరాల శాఖలో ఆగని అక్రమాలు
- ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి రేషన్‌దుకాణాల వరకు..
- సీఎంఆర్ ఇచ్చే మిల్లుల్లోనూ అనేక అవకతవకలు
- గట్టి చర్యలు లేక పట్టుతప్పుతున్న ప్రజాపంపిణీ వ్యవస్థ

రేషన్ దుకాణాలు	రేషన్ కార్డులు
423	2.19లక్షలు
లబ్ధిదారులు 6.43లక్షలు	
బియ్యం కేటాయింపు(జనవరి కోటా) 3524 మెట్రిక్ టన్నులు	

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పౌరసరఫరాల శాఖలో అవకతవకల పర్వం కొనసాగుతోంది. మంచిర్యాల మండల స్థాయి గిడ్డంగి వేంపల్లి శివారులో కొనసాగినప్పుడు 500 క్వింటాళ్ల ప్రజల బియ్యం అక్రమార్కుల పాలైంది. ఈ నిల్వల్లో తేడాపై విచారణ జరిపించి.. రికవరీ కోసం నెలల తరబడి జాప్యం జరిగింది. తాజాగా నస్పూర్ పరిధిలోని తీగల్‌పహాడ్‌లో ఉన్న ఎంఎల్‌ఎస్ పాయింట్‌లోనూ విజిలెన్స్ అధికారులు 15క్వింటాళ్ల బియ్యం తేడా ఉన్నట్లు గుర్తించారు. శుక్రవారం సాయంత్రం వరకు ఈ గోదాములో రికార్డులు, స్టాక్‌లు తనిఖీ చేశారు. ఇక్కడ కొంతకాలంగా రెగ్యులర్ ఉద్యోగి కాకుండా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. దీనిపై విజిలెన్స్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గోదాము తీరుపై నివేదిక రాసుకుని వెళ్లిపోయారు. జిల్లా కేంద్రం మంచిర్యాలలోని రాజీవ్‌నగర్ బఫర్ స్టాక్ గోదాముతోపాటు ఎఫ్‌సీఐ నుంచి బియ్యం ఎంఎల్‌ఎస్ పాయింట్లకు వస్తుంటాయి. జిల్లాలోని లక్సెట్టిపేట, మంచిర్యాల, తాండూర్, బెల్లంపల్లి, కోటపల్లి, చెన్నూర్ ఎంఎల్‌ఎస్ పాయింట్లకు ప్రతినెలా బియ్యం కోటాను బట్టి పంపిస్తుంటారు. అక్కడి నుంచి రేషన్ దుకాణాలకు చేరుతుంది. ఎప్పటికప్పుడు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుంటారు. కొన్ని రేషన్ దుకాణాలకు కోటా కంటే తక్కువగా పంపిస్తూ.. ఆ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. గతంలో జైపూర్ మండలంలోని ఓ దుకాణం కోటా కంటే ఎక్కువగా పంపి ఆ బియ్యాన్ని అక్కడి డీలర్‌తో నల్లబజార్‌లో అమ్మే ప్రయత్నాలు చేసిన ఘటనలు ఉన్నాయి. ఇక సీజ్ చేసిన బియ్యంలోనూ అక్రమాలు జరుగుతున్నాయి. ఇక కోవిడ్ సమయంలో హాస్టళ్లకు ఇవ్వాల్సిన సన్న బియ్యం సరైన నిర్ణయం తీసుకోకపోవడంతో ముక్కిపోయి, పనికి రాకుండా పోయాయి.

నిర్వహణలో నిర్లక్ష్యం

జిల్లాలో గత కొన్ని నెలలుగా రేషన్ బియ్యం పంపిణీ సజావుగా సాగడం లేదనే విమర్శలు ఉన్నాయి. వీటికి తోడు సిబ్బంది అక్రమాలతో ఆ శాఖ డొల్లతనం కనిపిస్తోంది. ఎంఎల్‌ఎస్ పాయింట్ల కేంద్రంగా జరుగుతున్న అక్రమాలపై పకడ్బందీగా వ్యవహరించడంలో నిర్లక్ష్యం వీడడం లేదు. జిల్లా పౌరసరఫరాల మేనేజర్ గోపాల్ వరి కొనుగోలు ధాన్యం సమయంలో విధులు సరిగా నిర్వర్తించడం లేదనే కారణంతో సరెండర్ చేశారు. అప్పటి నుంచి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్, డీఎంగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రెండు చోట్ల అదనపు బాధ్యతలతో దృష్టి సారించకపోవడంతోనూ సమస్యలు తలెత్తున్నాయి. అధికారులు, కింది స్థాయి సిబ్బందితో సమన్వయం లోపంతోనూ ప్రజా పంపిణీ సజావుగా సాగడం లేదు. మరోవైపు పీడీఎస్ బియ్యం యథేచ్ఛగా పక్కదారి పడుతోంది. కొందరు ఇదే వృత్తిగా చేపట్టి పీడీఎస్ దందా సాగిస్తున్నారు. జిల్లాలో పకడ్బందీగా పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీలు చేయకపోవడంతోనే దళారులు ఈ దందా ఆపడం లేదనే విమర్శలు ఉన్నాయి.

మిల్లులకు పీడీఎస్ బియ్యం

జిల్లాలో సీఎంఆర్ అందిస్తున్న మిల్లుల్లో కొన్ని మిల్లులు నుంచి రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం నుంచి కాకుండా నేరుగా పీడీఎస్ బియ్యాన్నే కొనుగోలు చేసి మళ్లీ పౌరసరఫరాల శాఖకు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వీటిపై చాలా సార్లు అధికారులు తనిఖీలు చేశారు. నేరుగా ఎంఎల్‌ఎస్ పాయింట్లలో రీ సైక్లింగ్ జరుగుతున్నాయా? లేదా అనేది పరీక్షలు నిర్వహించారు. ఈ నెల 14న హాజీపూర్ మండలం సబ్బెపల్లిలోని శ్రీనివాస లక్ష్మీ రైస్ మిల్లులో 35క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటిపై విచారణ జరుగుతోంది. గతంలో మందమర్రి మండలం మేడారం శివారు మిల్లుల్లో, జైపూర్ మండలం పరిధిలో మిల్లుల్లోనూ పీడీఎస్ బియ్యాన్ని సీఎంఆర్(కస్టం మిల్లింగ్ రైస్) కోసం రీ సైక్లింగ్‌కు వాడుతున్నట్లు గుర్తించారు. మిల్లుల నుంచి సీఎంఆర్ బియ్యం పంపిణీ చేసే ముందే స్టేజ్ గోదాంలో టెక్నికల్ అధికారి బియ్యం ఎలా పాస్ చేస్తున్నారనేది అనేక అనుమానాలకు తావిస్తోంది. ఎఫ్‌సీఐ పరిధిలో ఇవ్వాల్సిన బియ్యం మాత్రం ఏ మాత్రం నాణ్యత లేకున్నా తిరిగి పంపిస్తుండడంతో కేవలం పౌరసరఫరాల శాఖకు మాత్రమే మిల్లర్లు బియ్యం ఇస్తున్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ నిర్లక్ష్యంతో ప్రతీ సీజన్‌లోనూ చాలా మంది మిల్లర్లు గడువులోపు సకాలంలో బియ్యం అందడం లేదు. ఇవే కాకుండా ధాన్యం సేకరణ సమయంలో తరుగు పేరుతో రైతుల నుంచి దోపిడీ, మిల్లులకు అప్పగించిన ధాన్యం పక్కదారి పట్టిన ఘటనలు ఉన్నాయి.

కొత్త రైతులకు అందని 'బంధు'!

- దరఖాస్తులు స్వీకరించిన ఏఈవోలు
- కొద్దిరోజులుగా నిలిచిన లాగిన్ సౌకర్యం



కొత్త పట్టా పాసు పుస్తకంతో ఇందారపు శ్రీనివాస్, ఇందారం రాజం, నెన్నెల(ఎకరం, ఎకరం ఇద్దరికి వారసత్వంగా వచ్చిన భూమి)

మంచిర్యాలఅగ్రికల్చర్: కొత్త పట్టాపాస్ పుస్తకాలు పొందిన రైతులకు 'రైతుబంధు' అందని ద్రాక్షగా మారింది. యాసంగి పంటల సాగు మొదలై నెల రోజులు గడుస్తున్నా సాయం అందుతుందన్న భరోసా లేకుండా పోయింది. ప్రభుత్వం ఈ ఏడాది యాసంగి పెట్టుబడి నగదు సాయం గత డిసెంబర్ 28నుంచి రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. గత డిసెంబర్ 20వరకు కొత్త పట్టా పాస్‌పుస్తకాలు పొంది ధరణిలో డీఎస్ అయిన రైతులు రైతుబంధు సాయానికి అర్హులుగా ప్రకటించింది. గత నెల 28నుంచి జనవరి 7వరకు గ్రామాల వారీగా ఏఈవోలు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కానీ ఇప్పటివరకు ఏ ఒక్క కొత్త రైతుకు రైతుబంధు అందలేదు. మొదటి రోజు ఒక్కరోజు మాత్రమే లాగిన్ పని చేసిందని, మరుసటి రోజు నుంచి నిలిచిపోయిందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో 1,42,645మంది రైతులు ఉండగా.. ఇప్పటివరకు 1,38,276మందిరైతులకు నగదు ఖాతాల్లో జమ చేశారు. కొత్త రైతులు 4,276మందికి నగదు అందలేదు. ధరణి పోర్టల్‌లో రైతు, భూ విస్తీర్ణం తప్పులుగా నమోదు కావడంతో పట్టాపాసు పుస్తకాలు అందలేదు. ధరణిలో పోర్టల్‌లో ప్రభుత్వం కల్పించిన 34 రకాల మ్యాడుల్స్ ద్వారా మార్పులు, చేర్పులు, సవరణల అవకాశంతో కొత్త పాస్‌పుస్తకాలు అందాయి. ఏఓ, ఏఈవోలు రైతుబంధు లాగిన్‌లో నమోదు చేస్తే ఇప్పటికే పెట్టుబడి సాయం జమ అయ్యేది. కానీ లాగిన్ సౌకర్యం రాష్ట్ర వ్యాప్తంగా నిలిచిపోయిందని అధికారులు తెలిపారు. 10 ఎకరాలకు పైబడి భూమి కలిగిన రైతులకు ఇంకా నగదు జమ కాలేదు.

రైతుబంధు రాలె..



ఐదు ఎకరాల భూమి మూడు నెలల క్రితం రిజిస్ట్రేషన్ చేసుకుంటే కొత్తగా పట్టాపాస్ పుస్తకం వచ్చింది. ధరణి పోర్టల్ ఆన్‌లైన్‌లో నమోదైంది. రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకున్నాం. ఇంతవరకు రాలేదు. ఏఈవోను అడుగుతే పడుతయి పడుతయి అంటున్నారు. ఆలస్యం చేయకుండా రైతుబంధు అందించాలి.

– సుంకరి మధు, నెన్నెల

లాగిన్ ప్రాబ్లం ఉంది..

కొత్తగా పట్టపాస్ పుస్తకాలు అందిన రైతుల నుంచి రైతుబంధు కోసం ఏఈవోలు దరఖాస్తు స్వీకరించారు. రైతుబంధు లాగిన్‌లో నమోదు చేయడం జరుగుతుంది. కొద్ది రోజులుగా రైతుబంధు లాగిన్ నిలిచిపోయింది. లాగిన్ ఓపెన్ కాగానే రైతుల వివరాలు ఎంట్రీ చేస్తాం. ఖాతాల్లో రైతుబంధు నగదు జమ అవుతుంది.

– కల్పన, జిల్లా వ్యవసాయ అధికారి

'కంటివెలుగు' సమర్థవంతంగా నిర్వహించాలి

- పరీక్షల వివరాలు ట్యాబ్‌లో నమోదు చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



పాల్గొన్న జిల్లా కలెక్టర్ భారతి హోళ్లికేరి

మంచిర్యాలఅగ్రికల్చర్: కంటివెలుగు రెండో విడత కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన శిబిరాలను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో కంటివెలుగు కార్యక్రమం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ 18ఏళ్ల పైబడిన ప్రతీఒక్కరికి పరీక్షలు నిర్వహించి మందులు, అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేయాలని తెలిపారు. కంటిపరీక్షల వివరాలు ట్యాబ్-1, ట్యాబ్-2లలో నమోదు చేయాలని తెలిపారు. రోజువారీగా శిబిరాల్లో మందులు, కళ్లద్దాల నిల్వల వివరాలను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌లో తెలియజేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ భారతి హోళ్లికేరి మాట్లాడుతూ జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహణకు 40 శిబిరాలు ఏర్పాటు చేశామని, శిబిరాల్లో ప్రజలకు తాగునీరు, షామియానా, కుర్చీలు మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, ట్రెయినీ కలెక్టర్ పి.గౌతమి, వైద్యాధికారి ఫయాజ్ పాల్గొన్నారు.

నాగోబాకు మహాభిషేకం

- అర్ధరాత్రి మెస్రం వంశీయుల పూజలు
- కొత్త కోడళ్ల భేటింగ్
- భక్తజన సంద్రంగా కేస్లాపూర్
- ప్రారంభమైన జాతర



హారతి తీసుకుంటున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఉట్నూర్/ఇంద్రవెల్లి(ఖానాపూర్): ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో శనివారం అర్ధరాత్రి మెస్రం వంశీయులు పవిత్ర గంగాజలాలతో నాగోబాను అభిషేకించడంతో జాతర ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచే కాకుండా రాష్ట్రంలోని ఇతర జిల్లాలతోపాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా, జార్ఖండ్ తదితర రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చిన ఆదివాసీలతో కేస్లాపూర్ భక్తజనసంద్రంగా మారింది.

ఉదయం నుంచే ప్రత్యేక పూజలు..

నాగోబా ఆలయ సమీపంలోని వడమర(మర్రిచెట్ల) వద్ద విడిది చేసిన మెస్రం వంశీయులు, పెద్దలు(పటేళ్లు) ఉదయం నుంచి సంప్రదాయ పూజలు నిర్వహించారు. వేకువజామున 84 మందికి తూమ్(చనిపోయిన వారికి కర్మకాండలు) నిర్వహించి నాలుగుసార్లు సంప్రదాయ వాయిద్యాలు వాయించారు. ఉదయం 10.30 గంటలకు నాగేంద్రుడి విగ్రహంతో ఆలయానికి చేరుకున్నారు. సిరికొండ నుంచి తెప్పించిన కుండలకు మెస్రం పెద్దలు పూజలు చేశారు. వంశంలోని 22 తెగలకు చెందిన ఆడపడుచులు తమ వంశ పెద్దలు, పూజారులకు పాదాభివందనం చేశారు. నాయక్‌పాడ్(నైవేద్యం తయారు చేసేవారు) నుంచి మట్టి కుండలు స్వీకరించారు.

పవిత్ర జలాలతో...

మట్టి కుండలు స్వీకరించిన మెస్రం మహిళలు, ఆడపడుచులు వడమర (మర్రిచెట్ల) సమీపంలోని కోనేరు నుంచి పవిత్ర జలాలను తీసుకువచ్చారు. నాగోబా సన్నిధిలో గతేడాది నిర్మించిన మట్టి పుట్టలను మెస్రం వంశ అల్లుళ్లు తొలగించారు. దాని స్థానంలో మెస్రం వంశ ఆడపడుచులు ఆవు పేడ, పవిత్ర జలాలు, మట్టి మిశ్రమంతో కొత్తగా పుట్టలను తయారు చేశారు. ఈ మట్టితో తయారు చేసిన ఉండలను మహిళలు చేతుల మీదుగా తరలించి సతీదేవతల ముందు ఏడు వరుసల భౌల తయారు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పుట్టలకు ప్రత్యేక పూజలు చేస్తూ కిక్రీ, డోలు తదితర వాయిద్యాలు వాయిస్తూ పెద్దలు కచేరీ నిర్వహించారు. సాయంత్రం మర్రిచెట్ల వద్ద విడిది చేసిన మెస్రం వంశీయులు ఆలయం సమీపంలోని గోవాడా(గుండ్రంగా గోడకట్టి ఉండే ప్రదేశం) చేరుకుని 22 కితలలో విడిది చేశారు. అభిషేక ఘట్టం ముగిసే వరకు వారు ఇక్కడే ఉండి పూజలు నిర్వహించడం ఆనవాయితీ.

అర్ధరాత్రి పూజలతో...

మెస్రం వంశీయులు ఈ నెల 1న గంగాజలం కోసం పాదయాత్ర చేపట్టిన విషయం తెలిసిందే. జన్నారం మండలం కలమడుగు గోదావరి నుంచి తీసుకొచ్చిన పవిత్ర గంగాజలంతో శనివారం అర్ధరాత్రి నాగోబాను అభిషేకించి మహాపూజ నిర్వహించారు. అనంతరం భేటింగ్ కాని మెస్రం వంశ కోడళ్లతో సతీదేవతల పూజలు చేయించారు. తర్వాత వారిని మెస్రం వంశీయులకు పరిచయం చేస్తూ(భేటింగ్) నిర్వహించారు. దీంతో వీరిని మెస్రం వంశీయులుగా గుర్తిస్తూ తమ ఆరాధ్యదైవం నాగోబా దర్శనం కల్పించారు. ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యేలు కోనప్ప, ఆత్రం సక్కు, రేఖానాయక్, కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు కేస్లాపూర్‌కు కేంద్ర మంత్రి..

కైలాస్‌నగర్: కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి అర్జున్ ముండా ఆదివారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌కు రానున్నట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.45 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో కేస్లాపూర్‌కు చేరుకుంటారని పేర్కొన్నారు. నాగోబాను దర్శించుకుని ఆలయంలో పూజలు, ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో ఆలయ సమీపంలో హెలిప్యాడ్, పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



పుట్ట తయారీ కోసం ఆవు పేడను తీసుకొస్తున్న మహిళలు



గంగాజలానికి పూజలు చేస్తున్న వంశీయులు



విద్యుత్ దీపాల వెలుతురులో మెరిసిపోతున్న నాగోబా ఆలయం

బాలికలపై అఘాయిత్యాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఉదయ్‌కుమార్

మంచిర్యాలక్రైం: బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలపై అప్రమత్తంగా ఉండాలని న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జీ.ఉదయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని హమాలీవాడ బీసీ బాలికల వసతిగృహంలో శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్లను విధిగా గుర్తుంచుకోవాలని, షీ టీమ్‌పై అవగాహన ఉండాలని అన్నారు. దాడులు, వేధింపులు, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌పై షీ టీమ్‌కు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సుగుణాకర్, న్యాయవాదులు చుంచు సదానందం, గంగయ్య, బీసీ వెల్ఫేర్ అధికారి వినోద్‌కుమార్, అసిస్టెంట్ వెల్ఫేర్ అధికారి భాగ్యవతి, తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి సదరం శిబిరాలు

మంచిర్యాలటౌన్: ఈ నెల 25నుంచి సదరం శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు వైకల్య ధ్రువీకరణ పత్రం పొందేందుకు వైద్య పరీక్షల కోసం మీ సేవలో స్లాట్ బుక్ చేసుకోవాలని పేర్కొన్నారు. 25న మూగ, చెవుడు, 27న కంటిచూపు, 30న మానసిక వికలాంగులు, 31న శారీరక వికలాంగులు, ఫిబ్రవరి 2న మూగ, చెవుడు, 8న శారీరక వికలాంగులు, 24న కంటి చూపు, 27న మానసిక వికలాంగులు జిల్లా ఆసుపత్రిలో వైద్య పరీక్షలకు హాజరు కావాలని తెలిపారు.

క్లుప్తంగా

గుంతలో పడి వృద్ధుడి మృతి


మధునయ్య (ఫైల్)

నెన్నెల(భీమిని): కన్నెపల్లి మండలం చింతపుడి గ్రామానికి చెందిన ఎల్కరి మధునయ్య (63) నీటి గుంతలో పడి మృతి చెందాడు. ఎస్సై సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మధునయ్య వారం క్రితం సాయంత్రం బైక్‌పై ఇంటి నుంచి పీకలగుండం గ్రామానికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన ఇళ్లు, బంధువుల గ్రామాల్లో ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. మధునయ్య కుమారుడు అంకన్న ఫిర్యాదు మేరకు కన్నెపల్లి పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కాగా, శనివారం గ్రామ శివారులోని పీకలగుండం మూలమలుపు వద్ద నీటిగుంతలో మధునయ్య మృతదేహం, బైక్‌ను గుర్తించిన గొర్రెల కాపరులు అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న కుటుంబీకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య


రమేశ్ (ఫైల్)

సిర్పూర్(టి): మండలంలోని పారిగాం గ్రామానికి చెందిన దుర్కె రమేశ్ (47) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిర్పూర్(టి) ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రమేశ్‌కు అతడి భార్య అనసూర్యతో బంధువుల శుభకార్యానికి వెళ్లే విషయంలో గొడవ జరిగింది. ఆ తర్వాత తన వద్ద డబ్బులున్నాయని తనతోపాటు శుభకార్యానికి రావాలని అనసూర్య భర్తను కోరింది. దీంతో ఆటోలో వెళ్లాలని భార్యకు సూచించిన రమేశ్ తాను బైక్‌పై వస్తానని చెప్పాడు. భర్త సూచన మేరకు అనసూర్య ఆటోలో సిర్పూర్(టి)లోని బంధువుల ఇంటికి వెళ్లింది. శుభకార్యం ముగించుకుని రాత్రి ఇంటికి చేరుకున్న అనసూర్యకు రమేశ్ కనిపించలేదు. గ్రామంలో వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. లోనవెల్లి గ్రామానికి చెందిన పశువుల కాపరి పంట పొలంలో రమేశ్ పురుగుల మందు తాగి మృతి చెంది ఉండడాన్ని శనివారం గుర్తించాడు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. రమేశ్ కుమారుడు రజినీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

బెల్లంపల్లి: మున్సిపల్ పరిధి కన్నాల బస్తీ శివారులో ఓ యువకుడు రైలు ఢీకొని మృతి చెందాడు. బెల్లంపల్లి జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గంగారాంనగర్ బస్తీకి చెందిన గుండా రవికుమార్ (33) శనివారం బజారు ఏరియా ప్రాంతానికని వెళ్లాడు. కన్నాల బస్తీ శివారులోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద పట్టాలు దాటుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు రవికుమార్‌ను గుర్తు తెలియని రైలు ఢీకొంది. ఈ ఘటనలో రవికుమార్ రెండు కాళ్లు తెగడంతోపాటు ఛాతిలో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య పావని, కుమార్తె ఉన్నారు.

ఆగుతూ.. సాగుతూ..

- ముగిసిన శిక్షణ రేంజ్ అధికారుల మూడురోజుల క్షేత్రస్థాయి పర్యటన
- గోండుగూడ బేస్‌క్యాంపులో మకాం
- ఇక్కడి అభివృద్ధిపై అధ్యయనం
- అవగాహన కల్పించిన ఎఫ్‌డీవో
- అనుభూతి మరువలేమన్న ట్రెయినీలు


కాలినడకన అడవిలో పర్యటిస్తున్న ట్రెయినీలు


ట్రెయినీ రేంజ్ అధికారులకు డాగ్‌స్క్వాడ్ గురించి వివరిస్తున్న ఎఫ్‌డీవో

జన్నారం: అడవి తల్లి ఒడిలో ఆగుతూ.. సాగుతూ అడవుల పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, అడవుల అభివృద్ధిపై అవగాహన పొందిన శిక్షణ రేంజ్ అధికారులు మూడురోజుల శిక్షణ శనివారం పూర్తి చేసుకున్నారు. గుజరాత్ రాష్ట్రానికి చెందిన 42 మంది, జమ్ము కశ్మీర్ రాష్ట్రానికి చెందిన నలుగురు, లద్దాక్‌కు చెందిన ఒకరు దూలపెల్లి ఫారెస్ట్ అకాడమిలో శిక్షణ పొందుతున్నారు. క్షేత్ర స్థాయి పర్యటన కోసం వారు ఈనెల 10న దూలపెల్లి నుంచి బయలుదేరి వివిధ టైగర్‌జోన్లలో పర్యటించారు. తిప్పేశ్వర్, తడోభా, టైగర్ జోన్లలో పర్యటించిన వారు ఈనెల 18న కవ్వాల్ టైగర్‌జోన్‌కు వచ్చారు. ముందుగా నిర్మల్, ఆదిలాబాద్ ప్రాంత అడవుల్లో పర్యటించి జన్నారానికి చేరుకున్నారు. జన్నారం అటవీ డివిజన్‌లో మూడురోజులపాటు శిక్షణ పొందారు. జన్నారం రేంజ్ పరిధిలోని గోండుగూడ బేస్‌క్యాంపులో డేరాలు ఏర్పాటు చేసుకుని అడవిలోనే ఉన్నారు. ఉదయం 7నుంచి రాత్రి 8గంటల వరకు వారికి డివిజన్‌లోని అభివృద్ధి, అడవి, వన్యప్రాణుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను ఫారెస్ట్ డివిజనల్ అధికారి సిరిపురం మాధవరావు వివరించారు. డివిజన్‌లోని జన్నారం, ఇందన్‌పల్లి, తాళ్లపేట అటవీ రేంజ్‌ల పరిధిలో పర్యటించారు. వన్యప్రాణులను పరిశీలించడం, పాదముద్రలతో వన్యప్రాణులను గుర్తించడం, అడవులను రక్షించడం, వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన గడ్డి క్షేత్రాలు, నీటి కుంటలు, ఆవాసాల గురించి తెలుసుకున్నారు. వీటితో పాటు జియో సెంటర్, రాత్రి పెట్రోలింగ్, కాలి నడకన అడవుల పర్యటన తదితర అంశాల గురించి ఎఫ్‌డీవో వారికి వివరించారు. శనివారం పర్యటన పూర్తి చేసుకుని తిరిగి దూలపెల్లి అకాడమీకి వెళ్తున్న వారు ఇక్కడి అనుభవాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

గ్రాస్‌ల్యాండ్ బాగుంది



జన్నారం డివిజన్‌లో మూడురోజుల పాటు తిరిగాం. ఇక్కడ వన్యప్రాణుల కోసం గడ్డి క్షేత్రాలను విరివిగా పెంచారు. గడ్డి క్షేత్రాల ద్వారా వన్యప్రాణుల సంతతి పెరుగుతోంది. పులులకు కావాల్సిన ఆహారం ఇక్కడ లభిస్తోంది. గడ్డి క్షేత్రాల పెంపకం గురించి నేర్చుకున్నాం. ఎఫ్‌డీవో చక్కగా వివరించారు.

– జనక్ కాకడియా, ఆర్‌ఎఫ్‌వో, గుజరాత్

రాత్రి పెట్రోలింగ్ చేశాం



శిక్షణలో భాగంగా ఒక రోజు రాత్రి పెట్రోలింగ్ చేశాం. మా బృందంతో పాటు ఇక్కడి వారు పెట్రోలింగ్ గురించి తెలియజేశారు. చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేశాం. గ్రామాల్లో తిరిగాం. రాత్రి వన్యప్రాణులు చాలా కనిపించాయి. చుక్కల దుప్పులు చాలా ఉన్నాయి. రాత్రి పెట్రోలింగ్ కొత్త అనుభూతినిచ్చింది.

– నిధి చౌహాన్, ఆర్‌ఎఫ్‌వో, గుజరాత్

బర్డ్ వాచ్ బాగుంది



అడవిలోనే ఉంటూ ఉదయం ఆరు గంటలకు సమీపంలోని బైసన్‌కుంటకు వెళ్లాం. మాతోపాటు ఎఫ్‌డీవో కూడా వచ్చారు. ఆయనతో కలిసి ఉదయం బర్డ్‌వాచ్ చేశాం. పక్షుల గురించి ఎఫ్‌డీవో వివరించారు. అడవుల రక్షణలో టెక్నాలజీని ఉపయోగించే విధానం తెలిపారు. అడవిలో మూడురోజుల పాటు గడపడం మరువలేం.

– నామ్‌గ్యల్, ఆర్‌ఎఫ్‌వో, లద్దాక్

కాలినడకన పెట్రోలింగ్ చేశాం



శిక్షణలో భాగంగా ఒకరోజు కాలినడకన పెట్రోలింగ్ చేశాం. సుమారు 20 కిలోమీటర్లు నడిచాం. గుట్టలు, బండరాళ్లు ఎక్కాం. మాతో పాటు ఎఫ్‌డీవో మాధవరావు, సిబ్బంది వచ్చారు. ఇక్కడ టేకు వనం చాలా ఉంది. గడ్డి క్షేత్రాలు, నీటి కుంటలు చాలా అభివృద్ధి చేశారు. అడవుల రక్షణ గురించి తెలుసుకున్నాం.

– దివ్య, డ్యూటీ అధికారి, గుజరాత్

ఇక్కడి అభివృద్ధి వివరించాం



టైగర్‌జోన్ పరిధిలోని జన్నారం అటవీ డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులు, రక్షణ, గడ్డి క్షేత్రాలు, నీటి కుంటల గురించి వివరించాం. డివిజన్‌లోని బైసన్‌కుంట, ఘనిశెట్టి కుంట, కల్పకుంట, మైసమ్మ కుంట ప్రాంతాలకు తీసుకువెళ్లాం. ఇక్కడి అభివృద్ధి, రక్షణ, సిబ్బంది పనితీరు గురించి వివరించాం.

– సిరిపురం మాధవరావు, డిప్యూటీ కన్జర్వేటర్

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


జాతీయస్థాయికి ఎంపికైన వెంకటేశ్, కరణ్‌శర్మ

మంచిర్యాలటౌన్: జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన దాసరి వెంకటేశ్, కరణ్‌శర్మ ఎంపికైనట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్‌రావు, కార్యదర్శి కనపర్తి రమేశ్ తెలిపారు. ఈ నెల 26 నుంచి 30వరకు తమిళనాడులోని తిరుచిరపల్లిలో జరిగే 44వ జూనియర్ బాలుర జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు. వీరిని శనివారం అసోసియేషన్ కోశాధికారి అలుగువెల్లి రమేశ్‌రెడ్డి, కిషన్‌రావు, రామ్ వెంకటేశ్వర్లు, కంపెల్లి సమ్మయ్య అభినందించారు.

జన్నారం: మండలంలోని స్లేట్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి, అడ్మిషన్ ఇన్‌చార్జి రజిత తెలిపారు. ఈనెల 20న దండేపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన 18 మంది బాలురలో స్లేట్ హైస్కూల్‌కు చెందిన సిద్ధార్థ, కార్తీక్, వరుణ్, చారుహసన్, గణేశ్, 18 మంది బాలికల టీంలో ప్రణతి, అక్షయ, అక్షర, లస్సిక, సోనాలి, చైత్ర ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, యాజమాన్యం అభినందించారు.

ఒకరి బైండోవర్

మందమర్రిరూరల్: అక్రమంగా 40 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ తరలిస్తుండగా శుక్రవారం పట్టుబడిన మోటం రాజును శనివారం ఎస్సై చంద్రకుమార్ తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట బైండోవర్ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. నిందితుడు గతంలోనూ పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ పట్టుబడగా బైండోవర్ చేసినట్లు చెప్పారు. రూ.2లక్షలకు నోటీస్ ఇచ్చినట్లు తెలిపారు. దందా కొనసాగించడంతో గతంలో ఇచ్చిన రూ.2లక్షల నోటీస్ ప్రకారం జప్తు చేసినట్లు చెప్పారు. మరోసారి దందా కొనసాగిస్తే సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేస్తామని ఎస్సై తెలిపారు.

ఈ కేవైసీ పేరుతో దోపిడీ

- మీ సేవ నిర్వాహకుడి బాగోతం
- విచారణకు గ్రామస్తుల డిమాండ్


రూ.4వేలు డ్రా అయినట్లు స్టేట్‌మెంట్ చూపిస్తున్న బాధితుడు

కోటపల్లి: ఈ కేవైసీ కోసం వచ్చే వినియోగదారుల బ్యాంక్ ఖాతాల్లోని డబ్బులు విత్‌డ్రా చేసుకుంటున్న మీ సేవ నిర్వాహకుడు బాగోతం వెలుగులోకి వచ్చింది. మండలంలోని జనగామ గ్రామానికి చెందిన బాధితుడు గంట సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. సంతోష్ ఈ కేవైసీ కోసం శుక్రవారం అలుగామ గ్రామంలోని మీసేవ కేంద్రానికి వెళ్లాడు. మీ సేవ నిర్వాహకుడు సురేశ్ ఈ కేవైసీ చేసే క్రమంలోనే సంతోష్ అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని అతడి బ్యాంక్ ఖాతా నుంచి రూ.4వేలు విత్‌డ్రా చేసుకున్నాడు. ఇది గ్రహించని సంతోష్ శనివారం బ్యాంక్‌కు వెళ్లాడు. తన ఖాతాలోని రూ.25,100 విత్‌డ్రా చేసుకుందామనుకోగా అందులో రూ.20,100మాత్రమే ఉండడం చూసి కంగుతిన్నాడు. తన ఖాతాలోని రూ.4వేలు ఎలా.. ఎప్పుడు విత్‌డ్రా అయ్యాయని ఆరా తీశాడు. శుక్రవారం తన అకౌంట్ నుంచి మీ సేవ వద్ద విత్ డ్రా అయినట్లు తెలుసుకున్నాడు. సదరు మీ సేవ నిర్వాహకుడి వద్దకు వెళ్లి అడగగా తనకేమీ తెలియదని బుకాయించాడు. గట్టిగా మందలించగా తప్పు ఒప్పుకొని రూ.4వేలు తిరిగి ఇచ్చేశాడు. ఇటీవల జనగామ, రొయ్యలపల్లి, సుపాక గ్రామాలకు చెందిన పలువురి ఖాతాల్లోని డబ్బులను ఇలాగే కాజేసినట్లు సదరు మీసేవ నిర్వాహకుడిపై పలుసార్లు ఫిర్యాదులు వచ్చాయి. వీటిపై అధికారులు నామమాత్రపు విచారణ చేపట్టి చేతులు దులుపుకొన్నారు. ఈ కేవైసీ పేరుతో ఇంకా ఎంత మంది వద్ద ఇలా డబ్బులు కాజేశాడో.. విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని, మీ సేవ నిర్వాహకుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

యంత్రాల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించాలి


సీహెచ్‌పీని పరిశీలిస్తున్న తనిఖీ బృందం

రెబ్బెన(ఆసిఫాబాద్): బొగ్గు ఉత్పత్తిలో యంత్రాల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించాలని కార్పొరేట్ మిషన్ మెయింటనెన్స్ తనఖీ బృందం సభ్యుడు డీజీఎం సోమయాజులు సూచించారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీని శనివారం కార్పొరేట్ మిషన్ మెయింటనెన్స్ తనిఖీ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా సీహెచ్‌పీ పరిధిలో చేపట్టిన పనుల వివరాలు తెలుసుకున్నారు. యంత్రాల పనితీరును పరిశీలించి నిర్వహణపై ఆరా తీశారు. కన్వేయర్, వాగన్ బంకర్, ఆర్‌సీ ఫీడర్స్, ఫ్లగ్ ఫీడర్లను పరిశీలించారు. అనంతరం సోమయాజులు మాట్లాడుతూ.. బొగ్గు ఉత్పత్తిలో యంత్రాల పనితీరే కీలకమని పేర్కొన్నారు. యంత్రాల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. యంత్రాల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించినప్పుడే సంస్థ ఉత్పత్తి వ్యయం తగ్గి లాభాలు చేకూరుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఈ గాబ్రియెల్ రాజు, ఈఈ ఎస్.రాజు, ఏజీఎం తిరుమల్‌రావు, డీజీఎం భీంరావ్ జాడే, మెకానికల్ ఫోర్‌మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

తాగిన మైకంలో పశువుల కాపరి ఆత్మహత్య

నెన్నెల: మండలంలోని జంగాల్‌పేటకు చెందిన పశువుల కాపరి మంగిలి దుర్గయ్య (52) తాగిన మైకంలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. దుర్గయ్య కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. శనివారం ఉదయం మద్యం సేవించి పశువులను తోలుకుని అడవికి వెళ్లాడు. తాగిన మైకంలో సాయంత్రం చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పశువుల కాపరులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య మధునక్క ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

'విభజన హామీల అమలులో కేసీఆర్ విఫలం'

మంచిర్యాల టౌన్: కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాతో పాటు, తెలంగాణ విభజన హామీల సాధనలో ముఖ్యమంత్రి కేసీఆర్ విఫలమయ్యారని తెలంగాణ జనసమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బీ బాబన్న ఆరోపించారు. తెలంగాణ జన సమితి అధినేత కోదండరాం ఆధ్వర్యంలో రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించే దీక్ష పోస్టర్‌ను జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల మద్దతుతో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకుని వనరులను కొల్లగొట్టి వారి ఆస్తులను పెంచుకుంటున్నారని విమర్శించారు. ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని, రూ.కోట్లు ఖర్చు పెట్టినా కాళేశ్వరం కింద పారకం తక్కువ, ముంపు ఎక్కువ ఉందన్నారు. నాసిరకంగా హాస్టల్‌లోని విద్యార్థులకు భోజనాలు పెడుతున్నారని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ పూర్తిగా విఫలమైందన్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లతోనే నలుగురు మహిళలు మరణించడం ఇందుకు నిదర్శనమని చెప్పారు. కేసీఆర్ చేసిన మోసాన్ని దేశవ్యాప్తంగా ఎండగడుతూనే, విభజన హామీల సాధనకు ఈ నెల 30న జంతర్‌మంతర్ వద్ద దీక్ష, 31న 'ప్రభుత్వ ఎనిమిదిన్నరేళ్ల పాలన అభివృద్ధి, వాస్తవాలు' అనే అంశం మీద సెమినార్ నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు రామచందర్ రెడ్డి, నాయకులు దేవిసత్యం, జైపాల్‌సింగ్, ప్రదీప్, సిరాజ్, బచ్చలి ప్రవీణ్‌కుమార్, రమేశ్ పాల్గొన్నారు.

దేశీదారు పట్టివేత


పట్టుబడిన దేశీదారు, నిందితుడితో పోలీసులు

వాంకిడి: మహారాష్ట్ర నుంచి అక్రమంగా తరలిస్తున్న దేశీదారును వాంకిడి పోలీసులు పట్టుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ శ్రీనివాస్ ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మండలంలోని బంబార గ్రామ శివారులో ఎస్సై డీ సాగర్ ఆధ్వర్యంలో శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో మహారాష్ట్రలోని బల్లార్షాకు చెందిన ఆదర్శ పటేల్ భద్రావతి నుంచి కారులో అక్రమంగా దేశీదారు తరలిస్తుండగా పట్టుబడ్డాడు. కారులో 34 దేశీదారు కాటన్లు లభించగా, వాటి విలువ రూ.1.19 లక్షలు.. బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.4లక్షలు ఉంటుంది. నిందితుడిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సీఐ తెలిపారు. ఆబ్కారీ ఎస్సై నరసింహాచారి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వింత ఆకారంలో పక్షులు


నస్పూర్‌లో కనిపించిన వింత పక్షులు

నస్పూర్: పట్టణంలోని జగదాంబ కాలనీలో గల ఓ ఇంటిలో శనివారం రెండు వింత ఆకారంలోని పక్షులు కనిపించాయి. శనివారం కాలనీకి చెందిన మెతుకు రాము ఇంటి ఆవరణలో వింత ఆకారంలో ఉన్న పక్షులు విచిత్ర శబ్దాలు చేశాయి. స్థానికులు వాటిని ఆసక్తిగా తిలకించారు. పక్షుల ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ విషయమై జిల్లా అటవీశాఖ అధికారి వినోద్‌కుమార్ సాహును సంప్రదించగా.. అవి గుడ్లగూబ జాతికి చెందిన పక్షులు అని, చాలా అరుదుగా కనిపిస్తాయని తెలిపారు.

నిలిచిన విద్యుత్ సరఫరా

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని టౌన్-2 పరిధిలోని పలుకాలనీల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిచి వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. మార్కెట్ ఏరియా, బస్టాండ్, ఇస్లాంపూర, జన్మభూమినగర్, మెడిలైఫ్‌లైన్, బెల్లంపల్లి చౌరస్తా, లక్ష్మీనగర్, గౌతమీనగర్, హైటెక్‌సిటీ, మారుతీనగర్, ఏసీసీ, అండాళమ్మకాలనీ, ఇక్బాల్ అహ్మద్‌నగర్, జాఫర్‌నగర్, వికాస్‌నగర్, శ్రీనివాసగార్డెన్, ఆర్‌ఆర్‌నగర్, సాయినగర్ తదితర కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిచింది. జిల్లా కేంద్రంలో టౌన్-2 పరిధిలో ఏసీసీ పరిధిలోని 33/11 కేవి విద్యుత్ సబ్‌స్టేషన్ కొత్త ట్రాన్స్‌ఫార్మర్ (పీటీఆర్)ను ఏర్పాటు చేస్తున్నందున శుక్రవారం ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు అంతరాయం ఉంటుందని అధికారులు ప్రకటించారు. కానీ.. శుక్రవారం కాకుండా శనివారం మరమ్మతులు చేపట్టగా రాత్రి వరకు సరఫరా లేక వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. దీనిపై సంబంధిత ఏఈ జాన్‌ను వివరణ కోరగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్రకటించినా సాంకేతిక కారణాలతో శనివారం ట్రాన్స్‌ఫార్మర్ బిగించామన్నారు. పూర్తి స్థాయిలో మరమ్మతు చేపట్టడానికి ఆదివారం వరకు సమయం పడుతుందని తెలిపారు.

'సంపన్న వర్గాల కొమ్ముకాస్తున్న కేంద్రం'


మాట్లాడుతున్న అశోక్

బెల్లంపల్లి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులు, సంపన్న వర్గాల కొమ్ము కాస్తోందని ఎంసీపీఐ (యూ) జాతీయ కార్యదర్శి మద్దికాయల అశోక్ ఆరోపించారు. శనివారం బెల్లంపల్లి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మతోన్మాద, ఫాసిస్ట్ విధానాలను వేగవంతం చేస్తూ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం పాకులాడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ కార్మిక వర్గాన్నీ తీవ్ర నిర్లక్ష్యానికి గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజాప్రయోజనాలను కాపాడాల్సిన ప్రధానమంత్రి దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడం దారుణమన్నారు. దేశ ఆర్థిక రంగానికి ప్రధాన వనరైన నల్లబంగారం సింగరేణిని ప్రైవేట్ పరం చేయడానికి కుట్రలు, కుయుక్తులు పన్నుతున్నారని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అవలంభిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వామపక్ష, కమ్యూనిస్టు సామాజిక శక్తులన్నీ ఏకమై ప్రజా పోరాటాలతో పాలకులకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో రాజ్యాధికారం కోసం ఏర్పడిన బహుజన లెఫ్ట్‌ఫ్రంట్ (బీఎల్‌ఎఫ్)ను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలు బీఎల్‌ఎఫ్‌ను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈనెల 25న హైదరాబాద్‌లోని ఓంకార్‌భవన్‌లో బీఎల్‌ఎఫ్ ఐదో ఆవిర్భావ సభ నిర్వహిస్తున్నామని, అన్ని వర్గాల ప్రజలు సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. బెల్లంపల్లిలో ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. అక్రమార్కుల చెర నుంచి ప్రభుత్వ భూములను కాపాడడానికి, ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకోవడానికి ప్రభుత్వ యంత్రాంగం చిత్తశుద్ధితో పని చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి సబ్బని కృష్ణ, ఏఐసీటీయూ జాతీయ కమిటీ సభ్యుడు నర్ర ప్రతాప్, ఎంసీపీఐ (యూ) అనుబంధ ప్రజాసంఘాల నాయకులు కామెర పద్మ, ఆకాశ్, స్రవంతి, వెంకటేశ్, రమేశ్, శ్రీనివాస్, రాజయ్య, మల్లేశ్ పాల్గొన్నారు.

హెచ్‌ఎంలకు ఐదేళ్ల కాలాన్ని కొనసాగించాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న గెజిటెడ్ హెచ్‌ఎంలు

మంచిర్యాలఅర్బన్: త్వరలో చేపట్టనున్న బదిలీల్లో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు లాంగ్‌స్టాండింగ్ ఐదేళ్ల కాలాన్ని కొనసాగించాలని శనివారం తెలంగాణ స్టేట్ గెజిటెడ్ హెడ్‌మాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే దివాకర్‌రావు, డీఈవో వెంకటేశ్వర్లుకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. బదిలీల నిబంధనలు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు పాఠశాలలో పనిచేసే గరిష్ఠకాలాన్ని ఐదేళ్లకు బదులు ఎనిమిదేళ్లకు మార్చబోతున్నట్లు ప్రచారం జరిగిందన్నారు. పాఠశాల నిర్వహణకు మంచిది కాదని, ఐదేళ్లు కొనసాగించాలని కోరారు. అసోసియేషన్ అధ్యక్షుడు హన్మాండ్లు, ప్రధాన కార్యదర్శి రాథోడ్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు .

అక్రమ నిర్మాణాల కూల్చివేత


ప్రహరీని కూల్చవద్దని అదనపు కలెక్టర్, ఆర్డీవోను కోరుతున్న బాధితుడు

బెల్లంపల్లి: ప్రభుత్వ భూముల ఆక్రమణ, అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వ యంత్రాంగం కన్నెర్ర జేసింది. బెల్లంపల్లిలోని ప్రభుత్వ భూముల్లోని అక్రమ కట్టడాలను శనివారం జేసీబీతో అధికారులు దగ్గరుండి కూల్చివేయించారు. ఆక్రమిత భూమిలో పెంచుతున్న మామిడి మొక్కలను పీకి పారేశారు. ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకున్నారు. అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ ఆధ్వర్యంలో బెల్లంపల్లి ఆర్డీవో శ్యామలాదేవి, తహసీల్దార్ కుమారస్వామి, డెప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వీఆర్‌ఏలు, పోలీస్ బందోబస్తుతో వేకువజామున కన్నాల ప్రాంతానికి చేరుకున్నారు. కన్నాల శివారు సర్వే నంబర్లు 139, 141, 142లోని ప్రభుత్వ భూమిలో నాటిన మామిడి మొక్కలను జేసీబీతో ధ్వంసం చేయించారు. కొన్నింటిని రెవెన్యూ సిబ్బంది పీకి పారేశారు. అన్యాక్రాంతమైన 1.5 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్న అధికారులు పక్కనే ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్ల వెనకాల ఉన్న సర్వే నంబర్ 119, 120లోని ప్రభుత్వ భూమిలో నిర్మించిన ప్రహరీని జేసీబీతో పడగొట్టించారు. కబ్జాకు గురైన మరో 1.5 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. బీఆర్‌ఎస్ నాయకుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ సిలివేరు నర్సింగం అక్కడికి చేరుకుని సర్వే నంబర్ 112లో తన పేరిట 1.20 గుంటల భూమి ఉందని, ఆ భూమికి సంబంధించిన పత్రాలన్నీ ఉన్నాయని, ప్రహరీని కూల్చివేయడం సరైంది కాదని ఆర్డీవో శ్యామలాదేవి, తహసీల్దార్ కుమారస్వామితో మాట్లాడారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని ప్రహరీ నిర్మించారని రెవెన్యూ అధికారులు నర్సింగంకు సమాధానం చెప్పారు. తన భూమికి సంబంధించిన వ్యవహారాలన్నీ చట్టపరంగా తేల్చుకుంటానని అక్కడి నుంచి వెళ్లి పోయాడు. అక్కడి నుంచి కన్నాల ఫ్లైఓవర్ బ్రిడ్జి పక్కన ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మించిన పలు ఇళ్లు, గాంధీనగర్‌లో జాతీయ రహదారికి ఆనుకుని ప్రభుత్వ భూమిలో నిర్మించిన మరికొన్ని ఇళ్లను జేసీబీ సాయంతో తొలగించారు. వరుసగా మూడు ప్రాంతాల్లో ప్రభుత్వ భూమిలో చేపట్టిన నిర్మాణాలను కూల్చివేయడం బెల్లంపల్లిలో కలకలం రేపింది. బెల్లంపల్లి రూరల్ సీఐ కోట బాబురావు ఆధ్వర్యంలో ఎస్సైలు రాజశేఖర్, ఆంజనేయరావు, రాజశేఖర్, పలువురు ఏఎస్సైలు, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. బెల్లంపల్లి, కాసిపేట, కన్నెపల్లి, భీమిని డెప్యూటీ తహసీల్దార్లు ప్రసాద్, హమీద్, లక్ష్మీరాజం, మాణిక్‌రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పరమేశ్వరి, ఆదిలక్ష్మి, మండల సర్వేయర్ సుధాకర్, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.